# మనిషి-మనిషి

చిరిగిన చెప్పులతో, చెదరిన ముంగురులతో, నీరసంతో వ్రేలాడుతూన్న మొహంతో ఇంటిదారి పట్టాడు, సీతారావు. అతనికి వెంటనే ఇంటికి చేరాలని లేదు. వెడితే, 'అది లేదు; ఇది లేదు' అని ఎప్పటికీ తీరేగదా! 'ఇంటికన్న గుడిపదిలం' అన్నది అతనికివరిస్తుంది, గుడికి "ఆఫీసు" అని అర్థం చేసుకుంటే అయినా, సాయంత్రం అయిదింటికే, ఆఫీసు తలుపులు మూతపడడంవల్ల విధిలేక ఇంటిదారిపట్టాడు సీతారావు. అడుగులో అడుగేసుకుంటూ ఎత్తుగల్ల నడకతో ముందుకుసాగుతున్నాడు.

ఇంటికి వెళ్ళగానే, పిల్లలు ఏవేవో తెమ్మంటారు. అక్కడికీ, కమల సత్యకాలం మనిషి కాబట్టి, సరిపోతూంది పాపం, ఆమె మాత్రం తనను కట్టుకుని ఏం సుఖపడింది? ఆమె తండ్రి చేయించిన నగలన్నీ సంసారసాగరంలో కప్పేసినా, ఎన్నడూ ఆ మాట ఎత్తలేదు! చిరిగిన చీరతో కట్టుకుని కాలం దొర్లించుకుంటూన్నా, ఎన్నడూ నోరువిప్పి గుడ్డముక్క కొనమనదు

ఇంతకీ సీతారావు తానుమాత్రం ఏం చేస్తాడు? నెల నెలా వస్తున్న నూరు రూపాయలలో, ఒక్కటకూడా ముందు నెల ఒకటో తారీకు చూడదు! సామాన్య మానవుడికి, అందులోనూ, కంపెనీ గుమాస్తాకి వుండే ఈతిబాధలన్నీ అతనికీ వున్నాయి. సీతారావు నడుస్తూ నడుస్తూ తనలో ఇలాగనుకున్నాడు "నేనూ ఓనాడు బాగా బ్రతికిన వాడినే పెళ్ళినాటికి బి ఏ చదువుతున్నాను గొర్రెతోకలాంటి ఈ వుద్యోగంలో చేరతానని కల్లోనైనా అనుకున్నానా? బి ఏ ప్యాసయిన వాళ్ళందరూ నాలాగే వున్నారా?"

సీతారావు మనస్సు తన అధికారి విభీషణరావు సతిమీదికి మరలింది. నిజమే, అయనా బి ఏ ప్యాసయ్యాడు ఆయన జీతం ప్రస్తుతం వెయ్యి. అంతమాత్రాన ఆయన తనకన్న పదిరెట్లు ఎక్కువపని చేస్తున్నాడా? పదిరెట్లు పెద్ద సంసారాన్ని భరిస్తున్నాడా?? పరిపరి విధాల ఆలోచిస్తూ సీతారావు నడక వేగం ఎక్కువ చేశాడు

సీతారావు ఇల్లు చేరుకునేసరికి చిరుచీకట అలముకుంటూంది అతను గుమ్మంలో అడుగు పెటగానే లోనుండి మూలుగు వినిపించి ఆగిపోయాడు

"నాన్నగారు వస్తారమ్మా! బహుశా నీ మందు తేడానికి వెళ్ళివుంటారు. అందుకే ఆలస్యమయింది," అన్న కూతురు విమల మాటలు, అతని చెవులో దూసుకుపోయాయి అతడు ఒక్కక్షణం అలా నిలబడి, జేబులు తడుముకున్నాడు చేతికో చిన్న కాగితంముక్క తగిలింది సీతారావు దాన్ని చేతిలో గట్టిగా పట్టుకుని, చరచరా బజారువైపు నడిచిపోయాడు అతనికి కనబడిన మొదటి మందులషాపులో ఆ చీటి చూపగా, అరుమ్మిప్పావలా తెమ్మన్నాడు, షాపువాడు. సీతారావు జేబులో అణా కానులుకూడా లేవు! అయినా, సిగ్గువిడిచి, "అయ్యా! నేను, 'సితారా కంపెనీ'లో పనిచేస్తున్నాను ఈబుడ్డి అరువిస్తే మీరుణం ఎన్నడూ మరచిపోను. సొమ్ము ఒకటో తేదీని తెచ్చి ఇచ్చేస్తాను" అన్నాడు.

**"జయంతి"**

షాపువాడు అతడిని వింతజంతువుని చూసినట్లు చూసి, గోడమీద, "అరువు ఇవ్వబడదు" అనే బోర్డును చూపించేడు సీతారావు చేతులుజోడించి, "బాబూ నమ్మండి మీ సొమ్ము నేనేం కాజెయ్యను నాభార్య జబ్బుతో పడివుంది దయచూడండి," అన్నాడు

దుకాణదారు చీదరించుకుంటూ, "వెళ్ళవయ్యా! దయచెయ్! మేమేం ధర్మాసుపత్రి పెట్టుకు కూర్చున్నామనుకున్నావా? అప్పట, అప్పు! ఆ మాత్రం అప్పు మీ ఆఫీసులో పుట్టదూ?" అంటూ చీటి షోకేసు మీద గిరాటువేశాడు.

సీతారావుకు తలకొట్టేసినట్లయింది. 'ఈ ప్రపంచంలో దయాదాక్షిణ్యాలు నిండుకున్నాయా!' అనుకున్నాడు చీటీ చేత పుచ్చుకుని తిన్నగా రోడ్డుమీదికి వచ్చేడు. ఆనాడు బజారంతా జనం ఇసకవేస్తే, రాలకుండా వున్నారు అతని కాళ్ళు వెనక్కి నడవడంలేదు

"ఆరు మూడైనా సరే, ఈరాత్రి మందు సీసా తీసుకునే ఇంటికి వెళ్ళాలి," అని తీర్మానించుకున్నాడు అతని కాళ్ళు సరాసరి అధికారి ఇంటికి దారితీస్తున్నాయి.

ఆ ఇలు తనకేం కొత్తదికాదు ఇంచుమించు ప్రతి ఆదివారం కాగితాలమీద దొరగారి సంతకం పెట్టించుకుందుకు వెళ్తూనే వుంటాడు. కాని, ఈనాడు ఆ యింటికి వెళ్ళడానికి కాళ్ళు తడబడుతున్నాయి. అయినా, ఎలాగో సముదాయించుకుని, "చెడ్డకాపురానికి ముప్పేమిటి? ఇస్తాను, ఇవ్వనూ అంటాడు గాని, ప్రాణం తీసెయ్యడుగదా! నా భార్యకంటే ఎక్కువా ఈ ఉద్యోగం," అనుకుంటూ నడక వేగం హెచ్చించాడు

విభీషణరావు బంగాళా సమీపించి, లోపలికి వెళ్ళడానికి సంకోచించాడు సీతారావు కాని ఇంతలోనే "ఎవరు వారు?" అంటూ ఓ జవాను బయటకి వచ్చాడు.

"నేను రాజన్నా," అనక తప్పింది కాదు

"ఎవరు? సీతంబాబుగారా! రండి. దొరగారు ఎక్కడికో వెళ్ళారు కూర్చోండి, ఇప్పుడేవస్తారు," అంటూ లోనికివెళ్ళి, సోఫాని తన బుజంమీది తుండుగుడ్డతో గులిపి, వినయంతో నిలబడ్డాడు రాజన్న ఆ అమాయకుని ఆదరణకి కరిగి, సోఫాలో కూర్చున్నాడు సీతారావు రాజన్న తన పని చూసుకుందుకు లోనికి వెళ్ళిపోయాడు. సీతారావు ఒక్కడూ కూర్చుని వెర్రిగా ఆలోచిస్తున్నాడు. "మనిషికీ మనిషికీ జీవితంలో ఎంత తేడా వుంది? ఈ ఇల్లూ, ఫర్నిచరూ, మెర్క్యురీ ఆర్క్ లైటూ, తెరలూ అబ్బా! ఇదేమి సాంఘిక న్యాయం? న్యాయం అనేది మనం చేసుకునే నిర్వచనంమీద ఆధారపడి వుంటుంది! నాలాటివాడు నూరురూపాయలు పుచ్చుకుంటే, ఇంకొకరు వెయ్యిరూపాయలు జీతం పుచ్చుకోడం న్యాయమా?" అనుకున్నాడు సీతారావు మనస్సులో మెరపుతీగలా ఒక ఆలోచన మెరసింది. ఆ ప్రదేశంలో జనసంచారం లేకపోవడంవల్ల, అతని ఊహకు ప్రోత్సాహం లభించింది వెంటనే లేచి నిలబడాడు కాని, జీవితంలో ఎన్నడూ చెయ్యని పనికి చేతులాడడంలేదు ఇంతలో భార్య—మంచంమీద జబ్బుతో పడివున్న కమల—జ్ఞాపకం వచ్చింది. అతని కాళ్ళు ప్రక్క గదిలోకి దారితీశాయి. అది దొరగారి పడకగది. అందులో కూడా

# ★ మనిషి - మనిషి ★

సీతారావు దొరగారి సమక్షంలో, ఇదివరకు మసలివున్నందున వెంటనే పరుపు క్రింది తాళం చెవులు తీసి, డ్రాయరు తెరిచేడు. లోపల పర్సులోని నోట్లకట్టలో ఒక్క పది రూపాయలనోటు మాత్రం జేబులో దూరేసి, తాళంచెవులు ఎప్పటిలా వుంచేసి, సావిట్లోకి వచ్చి ఏమీ ఎరగనట్లు కూర్చున్నాడు

సీతారావుకింక ఆసావిట్లోనే కాగు, ఆ ఇంటి సమీపంలోనే వుండాలని లేదు. అందుకే రాజన్నకైనా చెప్పకుండా రోడ్డు ఎక్కేశాడు గబగబా, బజారుముఖం పట్టి జనసమూహంలో కలిసిపోయాక, అతనికి కాస్త ధైర్యం కలిగింది తిన్నగా మందుల షాపుకి వెళ్లి జేబులోని చీటి, పదిరూపాయల నోటూ పడేశాడు. దుకాణదారు మందు సీసా ప్యాక్ చేసిపెట్టి, చిల్లరఇచ్చాడు సీతారావు చిరునవ్వుతో వానినిచూసి, బుడ్డి చేతపట్టుకుని ఇంటిదారిపట్టాడు అప్పటికి రాత్రి తొమ్మిదిదాటింది. ఇంట్లో కమల ఎలావుందో అనేఆత్రుత అతడిని ఇంచుమించు పరుగెత్తించింది ఇలు చేరుకునేసరికి, వీధిగుమ్మంలో కూతురు విమల నిలబడివుంది

"విమలా! అమ్మకెలావుంది?" అన్నాడు సీతారావు.

"ఉష్ గట్టిగా మాట్లాడకండి నిద్రపోతూంది. ఇప్పుడే డాక్టరు ఇంజక్షను ఇచ్చి వెళ్లారు" అంది విమల

"డాక్టరా? ఏడాక్టరు? ఎవరుపిలిచారు?" అని నిర్ఘాంతపోయాడు తండ్రి

"మీ ఆఫీసరు విభీషణరావుగారు తీసుకువచ్చారు."

"ఆఁ. ఆయనెలావచ్చారు?" అన్నాడు సీతారావు

"మీరు రావడం ఆలస్యమైతే, అక్కడున్నారేమో పిలవమని తమ్ముణ్ణి పంపించాను. వాడేం చెప్పేడో ఏమిటో ఆయనా, భార్యాకలిసి వాణ్ణితీసుకుని కారులోవచ్చారు అమ్మని చూసి, డాక్టర్ని తీసుకు మళ్ళీ వచ్చేరు. డాక్టరు పరీక్ష చేసి, ఇంజక్షను యిచ్చి, మందురాస్తే అబుడ్డికూడా డ్రైవరుచేత తెప్పించారు విభీషణరావుగారు వారంతా ఇప్పుడిప్పుడే డాక్టరుతో కలిసి కారులో వెళ్ళిపోయారు మీకు దారిలో ఎదురుపడలేదా?" అంది విమల.

సీతారావుకి ఆఖరిమాటలు వినబడలేదు చరచరా లోపలికి వెళ్ళేడు. ఏమీ ఎరుగని కమల నిద్రపోతూంది. ఆమె మంచంపక్క గూట్లో మందుసీసా, అచ్చంగా తనచేతిలోనిదే, నిలబడి తననుచూసి పకపకా నవ్వుతున్నట్లనిపించింది. సీతారావు నివ్వెరపోయాడు! నిజంగా రావడము, దొరగారు అంత శ్రమతీసుకోవడమూ తాను కల్లోనైన అనుకోని విషయాలు!!

ఆమరునాటికే కమల జబ్బు తిరుగుముఖం పట్టింది వరుసగా నాలుగురోజులు డాక్టరు వచ్చిచూసి ఇంజక్షన్లిచ్చాడు. విభీషణరావు కూడా ఇంకోమారు వచ్చిచూశాడు. తరువాత ఆఫీసులో సీతారావు పిలిచి తెలుసుకునేవాడు ఆమె ఆరోగ్యం గురించి. డాక్టరు చేతిచలవవల్ల కమల ఎప్పటి మనిషయింది. సీతారావులో ఒక క్రొత్త ఆనందం పొడచూపింది అయినా అతని హృదయాంతర్గతమైన ఒకపశ్చాత్తాపపువిషాద చిహ్నం మాత్రం చెరగలేదు

ఒకటో తేదీన జీతంముట్టగానే, సీతారావు దొరగారివద్దకువెళ్ళి, తనభార్య విషయమై డాక్టరు కెంత ఇచ్చేరో చెప్పమన్నాడు విభీషణరావు చిరునవ్వుతో, "మీ కష్టకాలంలో సాయపడగలిగానన్న సంతృప్తి ఆసొమ్మకు పదిరెట్లు విలువగలది," అన్నాడు సీతారావు కాదూకూడదని ఎన్ని చెప్పినా, అధికారి వినలేదు సీతారావు చాలాసిగ్గుపడ్డాడు తాను చేసినతప్పు—అధికారి గమనించాడో లేదోగాని, తనమట్టుకి తనకే తలవంపు కలిగించింది తాను స్వామిద్రోహినని పదేపదే నిందించుకున్నాడా సాయంత్రం.

ఆరాత్రి పదకొండు గంటలైనా, విభీషణరావు పడకగదిలో దీపం వెలుగుతూంది ఆయన ఆఫీసుపని చూసుకుంటూ కాగితాలు తిరగేస్తున్నాడు. ఇంతలో హఠాత్తుగా ఒక కాగితంపొట్లం అతని టేబులుమీద పడింది అతడు తలెత్తి చూసేసరికి, తెరచిన కిటికీ వూచలముందు మనిషికదిలిన అలికిడిఅయింది. విభీషణరావు పొట్లం విప్పి చూడగా, అందులో ఒకపదిరూపాయలనోటు మాత్రం వుంది ఆయన చిరునవ్వుతో తలపంకించి, తన ఆఫీసుపనిలో నిమగ్నుడయిపోయాడు.

ఆ సంవత్సరాంతంలో సీతారావుకి ప్రమోషన్‌వచ్చి జీతం రెండువందలయాభైకి పెరిగింది దానికి కారకులైన విభీషణరావు మీద సీతారావుకి భక్తికలిగింది. పరిచయమూ, చనువు ఎక్కువయాయి. కాని, ఆ పది రూపాయలనోటును గురించి క్షమాపణ చెప్పుకునే ధైర్యంమాత్రం అతడికిరాలేదు. ఆమాట ఆయనా ఎన్నడూ ఎత్తలేదు ఆఖరికి ఇద్దరూ మనుష్యులేకదా! ★


సిరోలిన్

మీ దగ్గుకి కారణము నిర్మూలము చేస్తుంది — మీ దగ్గుటను ఆపుట మాత్రమే కాదు

సిరోలిన్ మీకు దగ్గును కలిగించే అపాయకరమైన రోగ క్రిములను నిర్మూలిస్తుంది

దగ్గుకు నిరపాయమైన కుటుంబ ఔషధము




రోల్ ఫిల్ముల డెవలపింగు ప్రింటింగు, ఎన్‌లార్జిమెంటులకు, స్టూడియో ఫొటోలకు.

ఫొటో ఆర్టు సెంటర్, లజ్

మైలాపూరు, మద్రాసు 4 కు దయచేయండి

స్కిన్‌డెక్స్

గజ్జి, దురదలు, పుండ్లు మొ॥ చర్మవ్యాధులకు దివ్యాంజనము

శ్రీవత్స కెమికల్స్ & డ్రగ్స్ లిమిటెడ్, మద్రాసు-30.